రాష్ట్రస్థాయి పోటీల్లో నూజివీడు బాలికల సత్తా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఉమ్మడి కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ అండర్-14 బాలికల విభాగంలో నూజివీడు క్రీడాకారులైన బాలికలు ప్రతిభ కనబరిచినట్లు సీనియర్ పీడీ, కోచ్ డాక్టర్ వాకా నాగరాజు తెలిపారు. నూజివీడులో ఆయన సోమవారం మాట్లాడుతూ ఈ నెల 15 నుండి 18 వరకు చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్టుపై కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించి, తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు వివరించారు. నూజివీడు పట్టణ పరిధిలోని విక్టోరియా టౌన్ హాల్ (విటిహెచ్) క్రీడా ప్రాంగణం నుంచి ఏడుగురు క్రీడాకారులు సుశిక్షణ పొంది బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని నూజివీడు క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రథమంగా నిలిచి విజయం సాధిస్తారని ఆకాంక్షించారు.

మాట్లాడుతున్న మంత్రి మనోహర్

జవాబుదారీతనం

లేకపోతే ఎలా..?

డిఆర్‌సి సమావేశంలో అధికారులపై ఇన్‌ఛార్జి మంత్రి మనోహర్ ఆగ్రహం

సమావేశంలో ఆరు ప్రధాన అంశాలపై చర్చ

ఉద్యాన పంటలపై దృష్టి పెట్టాలని దిశానిర్దేశం

ప్రొటోకాల్‌ను లేవనెత్తిన జెడ్‌పి ఛైర్‌పర్సన్.. తర్వాత మాట్లాడదామన్న మంత్రి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా అధికారులు ప్రతి విషయంలోనూ జవాబుదారీతనంతో పని చేయాలని, పాత విషయాలను లేవనెత్తుతూ నిర్లక్ష్యంగా ఉంటే కుదరదని, మీడియాలో వచ్చిన వ్యతిరేక కథనాలపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు సంబంధించి దరఖాస్తులు నిలిపివేసినా, ఇంకా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పత్రికల్లో కథనాలు రావడంపై ఆ శాఖ అధికారులపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాలో వ్యతిరేక కథనాలు వస్తే ఉదయం 11 గంటల్లోపు సమావేశం పెట్టి వివరాలు వెల్లడించాలన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన గోదావరి సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం డిఆర్‌సి (జిల్లా సమీక్షా కమిటీ) సమావేశం జరిగింది. దీనిలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డితోపాటు జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎంఎల్‌ఎలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, మద్దిపాటి వెంకటరాజు, ఎంఎల్‌సి వంకా రవీంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇరిగేషన్ వంటి అంశాలతోపాటు ఎంఎల్‌ఎలు పలు సమస్యలను సమావేశంలో లేవనెత్తారు. రెండు గంటలపాటు సమావేశం నిర్వహించిన అనంతరం ఇన్‌ఛార్జి మంత్రి మీడియాకు వివరాలను వెల్లడించారు. సమావేశంలో ఆరు ప్రధాన అంశాలపై చర్చించినట్లు తెలిపారు. వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా ఇరిగేషన్ పనులపై ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని, నియోజకవర్గాలవారీగా ప్రణాళికలు రూపొందించుకుని పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి ఇప్పటి వరకూ 40 శాతం లక్ష్యం చేరుకున్నామని, జూన్ 15 కల్లా 65 శాతానికి చేరుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.

ఉద్యాన పంటల విస్తరణపై దృష్టి

ముఖ్యంగా ఉద్యాన పంటల విస్తరణపై దృష్టి పెట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశామన్నారు. ఐదెకరాల్లోపు పామాయిల్, కోకో వంటి పంటల విస్తరణకు ఈ ఏడాది ప్రణాళికతో ముందుకు సాగనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యానవన పంటల్లో జిల్లా ఐదో స్థానంలో ఉందని, మూడో స్థానానికి చేరుకునేలా నిర్ణయించుకుని ముందుకు సాగుతున్నామన్నారు. గతేడాది 29,340 ఎకరాల్లో ఉద్యాన పంటల విస్తరణ జరగ్గా ఈ ఏడాది ఇప్పటికే 8,750 ఎకరాలను గుర్తించామని, గతేడాదికంటే ఎక్కువగా పంటల విస్తరణ ఉంటుందని అధికారులు తెలిపారన్నారు. జూన్ మొదటి వారంలో ఉద్యాన పంటలపై ప్రత్యేక సెమినార్ ఏర్పాటు చేసేలా అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది పిల్లలు చేరేలా ప్రణాళికతో ముందుకు సాగేలా విద్యాశాఖ అధికారులకు తెలిపామన్నారు. 13 వేల మంది పిల్లలు ఈ ఏడాది చేరనున్నట్లు వివరించారు. సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని నిర్ణయించామన్నారు. ఏజెన్సీ, కొండ ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎంఎల్‌ఎను కలిసి జూన్ నెలాఖరుకల్లా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించామన్నారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిని పటిష్టం చేసేలా చర్యలు చేపడతామన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా రబీలో ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. ఏలూరు జిల్లాలో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.12,400 కోట్లు ధాన్యం సొమ్ము 24 గంటలు గడవకముందే జమ చేశామన్నారు. సిఎం ఆదేశాల ప్రకారం తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు ఇంకా సరిగా జరగడం లేదంటూ వైసిపి ఎంఎల్‌సి వంకా రవీంద్ర మాట్లాడగా రాజకీయ విమర్శలు వద్దని, ఆధారాలు ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. 25 శాతం పైబడి జరిగిన నాడు-నేడుతోపాటు ఇతర భవనాల పనులను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ద్వారకాతిరుమలలో కాలేజీ మూసివేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిన కథనాలపై మంత్రి పార్థసారథి ఇంటర్, దేవాదాయశాఖ అధికారులను గట్టిగా నిలదీశారు. కాలేజీ కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ వాహనాలను నిలుపుదల చేస్తున్నారా అని మీడియా అడిగిన ప్రశ్నకు మంగళవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ప్రొటోకాల్‌పై ఇప్పుడొద్దు

కొంతమంది ఎంఎల్‌ఎలు తమ నియోజకవర్గానికి జెడ్‌పి నిధులు ఇవ్వడం లేదని చెబుతున్నారని ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడబోగా, ఇన్‌ఛార్జి మంత్రి మనోహర్ జోక్యం చేసుకుని ఇది కరెక్ట్ కాదని ఆగ్రహంగా మాట్లాడారు. జెడ్‌పి సిఇఒ ఎవరని ప్రశ్నించి ఇలాంటివి జరగకూడదని హెచ్చరించారు. దెందులూరు నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని మరోసారి మాట్లాడగా తర్వాత మాట్లాడదామని చెప్పి మంత్రి ముగించేశారు.

సారా మరణాలపై టాస్క్‌ఫోర్స్

2022 మార్చిలో వైసిపి ప్రభుత్వ హయాంలో కల్తీ సారాతో 22 మంది మృతి

సారా మరణాలలపై నిగ్గు తేల్చాలన్న ఆలోచనతో ప్రభుత్వం ముందుకు

మద్యం ధరలు ఎక్కువగా ఉండటంతో అప్పట్లో నాటుసారా వైపు మందుబాబులు

సారా మరణాలు కాదంటూ అప్పట్లో ప్రభుత్వం వాదన

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం సైతం ఇవ్వని పరిస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గత వైసిపి ప్రభుత్వ హయాంలో 2022 మార్చిలో జంగారెడ్డిగూడెం పట్టణంలో చోటుచేసుకున్న కల్తీ సారా మరణాలపై ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో దాదాపు మూడేళ్ల క్రితం జరిగిన కల్తీ సారా మరణాలపై మరోసారి జిల్లాలో చర్చ ప్రారంభమైంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో మద్యం ధరలు ఎక్కువగా ఉండటంతో మందుబాబులు తక్కువ ధరకు వచ్చే నాటుసారా తాగేవారు. దీన్ని అదునుగా చేసుకుని కొంతమంది విచ్చలవిడిగా నాటుసారా అమ్మకాలు సాగించేవారు. కిక్ కోసం అనేక రకాల పదార్థాలను కలిపేసేవారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఈ కల్తీసారా తాగి రెండు రోజుల వ్యవధిలోనే దాదాపు 18 మంది మృతి చెందారు. ఒకరోజు ఐదుగురు చనిపోగా మర్నాడు ఏకంగా 13 మంది వరకూ చనిపోయిన పరిస్థితి నెలకొంది. మరో రెండు, మూడు రోజుల్లో నలుగురు మృతి చెందారు. కల్తీ సారా తాగి 22 మంది మృతి చెందడంతో అప్పట్లో పెద్దఎత్తున దుమారం రేగింది. రాష్ట్రవ్యాప్తంగా ఈవిషయం సంచలనం రేపింది. ఇవన్నీ ప్రభుత్వ హత్యలే అంటూ అప్పట్లో ప్రతిపక్షాలు అధికారపార్టీపై విరుచుకుపడ్డాయి. సారా మరణాలు కాదంటూ ప్రభుత్వం వాదనకు సైతం దిగింది. అప్పట్లో మరణించిన వారిలో నలుగురు మాత్రమే 60 నుంచి 70 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు. మిగిలిన వారంతా 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్నవారే. వారిలో ఎవరికీ ఎటువంటి అనారోగ్య సమస్యలూ లేవని, సారా తాగిన తర్వాత నీరసం, విరోచనాలు వంటివి సంభవించి మరణించారని మృతుల కుటుంబసభ్యులు భోరున విలపించారు. కుమారుడు చనిపోయిన తల్లితండ్రులు, భర్తను కోల్పోయిన మహిళలు రోడ్డెక్కి భోరున విలపించారు. అప్పట్లో ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు మార్చి 14న జంగారెడ్డిగూడెంలో పర్యటించి మృతుల కుటుంబాలను పరామర్శించారు. టిడిపి తరపున కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం మాత్రం చనిపోయిన వారంతా అనారోగ్యంతో చనిపోయారంటూ వాదించింది. మృతుల కుటుంబాలకు చిల్లిగవ్వ పరిహారం కూడా ఇవ్వలేదు. దీనిపై అప్పట్లో పెద్దదుమారమే రేగింది. నాటుసారా స్థావరాలపై ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ సైతం నిర్వహించింది.

మరణాల వెనుక వాస్తవాలు తీసేందుకు టాస్క్‌ఫోర్స్

అప్పట్లో కల్తీ సారా మరణాలపై ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విచారణ ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అప్పట్లో జరిగిన కల్తీసారా మరణాలపై నిగ్గు తేల్చేందుకు సిద్ధమైంది. ముగ్గురు అధికారులతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ బృందానికి ఏలూరు జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ నేతృత్వం వహించనుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ వేణు ప్రభుకుమార్, కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం హెచ్ఒడి ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. సారా మరణాలపై జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో నాలుగు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల పరిస్థితిని టాస్క్‌ఫోర్స్ బృందం పరిశీలించనుంది. మరణాలపై లోతుగా అధ్యయనం చేసి బాధ్యులెవరో గుర్తించాలని, సాంకేతిక పరమైన సిఫార్సులు కూడా చేయాలని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. టాస్క్‌ఫోర్స్ విచారణలో ఏం నిజాలు బయటపడతాయోననే చర్చ సర్వత్రా సాగుతోంది.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందా!

అప్పట్లో ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఎటువంటి పరిహారమూ ఇవ్వలేదు. దీంతో ఆయా కుటుంబాలు ఇప్పటికీ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కూటమి ప్రభుత్వం మృతుల కుటుంబాలకు పరిహారం అందించి ఆదుకోవాలని అంతా కోరుతున్నారు.

సమసమాజ స్థాపనే సుందరయ్యకు నిజమైన నివాళి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

పలుచోట్ల వర్ధంతి సభలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమ సమాజ స్థాపనే సుందరయ్యకు నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి, వియత్నాం విప్లవకారుడు హోచిమిన్ జయంతి కార్యక్రమాలు సోమవారం సిపిఎం జిల్లా కమిటీ తరఫున స్థానిక ఉద్దరాజు రామం భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి ఎ.రవి సుందరయ్య చిత్రపటానికి, జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు హోచిమిన్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య సేవలు, ఆయన చూపిన బాట గొప్పవని కొనియాడారు. ప్రస్తుత నీచ రాజకీయాలకు ప్రత్యామ్నాయ రాజకీయాలను, సమ సమాజ నిర్మాణానికి అవసరమైన రాజకీయాలను ఆయన చెప్పడమే కాకుండా ఆ రోజుల్లోనే చేసి చూపించారన్నారు. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడమే కాకుండా నడిపించిన విషయంలో ఆయన పాత్ర కీలకమన్నారు. హోచిమిన్ వియత్నాం విముక్తి కోసం పోరాడిన విప్లవ యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో శ్యామలారాణి, రామాంజనేయులు, కనకారావు, గోపీ, కోటేశ్వరరావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య 40వ వర్ధంతి సభను స్థానిక గానుగులపేట సుందరయ్య గ్రంథాలయం వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయం నిర్వాహకులు కంది విశ్వనాథం అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రసంగించారు. దేశం, రాష్ట్రం అభివృద్ధి కావాలంటే ప్రభుత్వాలు ఏ విధానాలు అవలంభించాలో 1950లోనే స్పష్టంగా చెప్పిన దార్శనికుడు అని అన్నారు. అగ్రకులంలో పుట్టినా కులం తోక కత్తిరించుకుని దళితులు, గిరిజనులు, అట్టడుగు తరగతుల ప్రజల కోసం జీవితాంతం పని చేశారన్నారు. సుందరయ్య స్ఫూర్తితో ఈ తరం పని చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం నగర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు ఎం.ఇస్సాక్, బలరాం, నాగేంద్ర, సిపిఎం నాయకులు వైఎస్.కనకారావు, కోటేశ్వరరావు, జి.రవి కిషోర్, కె.రామాంజనేయులు, అరుణకుమారి, వివిఎన్.ప్రసాద్, జై.గోపి పాల్గొని ప్రసంగించారు.



ఏలూరు: మాట్లాడుతున్న రవి

లింగపాలెం: కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య వీర తెలంగాణ సాయుధ పోరాటంలో దున్నేవారికి భూమి అనే నినాదంతో లక్ష ఎకరాలు పంపిణీ చేశారని, ఆ పోరాట స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం భూ పంపిణీ అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. సోమవారం తోచిలక గ్రామంలో సుందరయ్య 40వ వర్ధంతి, సిపిఎం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం దుబ్బాకు దాసు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ మాట్లాడుతూ సుందరయ్య దళితులు, అట్టడుగు వర్గాల కోసం వ్యవసాయ కూలి రేట్ల కోసం కుల వివక్ష నిర్మూలన కోసం పోరాడారన్నారు. వెనుకబడి జిల్లాలో ప్రాంతీయ మండలి పరిశ్రమలకు నిధులు కేటాయించి ప్రాజెక్టులు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం ప్రతివారం సొమ్ము చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ఉపాధి పనులు 200 రోజులు చూపాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.600 కూలి ఇవ్వాలని కోరుతూ ఈ నెల 20న అన్ని మండల కేంద్రాల్లో నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు బాబూరావు, జయరాజు, వెంకటేశ్వరరావు, గంగరాజు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: స్థానిక సుందరయ్య భవనంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించారు. సీనియర్ కమ్యూనిస్టు నేత మొవ్వ రాజారావు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. చిన్న ఆగిరిపల్లిలో ఉపాధి కూలీలు పని ప్రదేశంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, పట్టణ కార్యదర్శి ఎస్‌కె.జహాంగీర్ భాషా, నేతలు ఎం.నరేష్, ఎస్.కోటేశ్వరరావు, ఎన్.ఊళక్కయ్య, బి.కోటయ్య, ఎస్.రాంప్రసాద్, కె.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం పంగిడిగూడెంలో సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. సభకు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు గోగులమండ ప్రసాదరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆర్.లింగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సుందరయ్య చూపిన మార్గంలో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. విద్య, ఉపాధి అవకాశాల కోసం మరిన్ని పోరాటాలు జరగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మానుకొండ వీర్రాజు, భూక్య బిచ్చనాయక్, రాంపండు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో..

ఆగిరిపల్లిలో..



లింగపాలెం: తోచిలకలో

ఎపిఇఎపి సెట్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎపిఇఎపి సెట్-2025 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం మూడు గంటల నుంచి 6 గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు జరిగాయి. ఏలూరు కేంద్రంగా మూడు పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించగా వట్లూరులోని సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం మొత్తం 191 మందికి 180 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 150 మందికి 140 మంది హాజరవ్వగా పది మంది గైర్హాజరయ్యారు. అలాగే సిద్ధార్థ క్వెస్ట్ కళాశాలలో 161 మందికి 152 మంది హాజరవ్వగా తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. మూడు కేంద్రాల్లో కలిపి మొత్తం 502 మందికి 472 మంది హాజరవ్వగా 30 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 150 మందికి 137 మంది హాజరవ్వగా, 13 మంది గైర్హాజరయ్యారు. సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 190 మందికి 184 మంది హాజరవ్వగా ఆరుగురు గైర్హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్‌లో 161 మందికి 157 మంది హాజరవ్వగా నలుగురు గైర్హాజరయ్యారు. మూడు కేంద్రాల్లో మొత్తం 501 మందికి 478 మంది హాజరవ్వగా 23 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం కూడా అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరగనుండగా 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ పరీక్షలు జరగనున్నాయి.

65 మంది ద్విచక్ర వాహనదారులపై కేసులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 65మంది ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేసి కొందరు వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చామని ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం అన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం సబ్ డివిజన్ల పరిధిలో సోమవారం వాహన తనిఖీ అధికారులు జిల్లా ఉపరవాణా కమిషనర్ ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా సరైన పత్రాలు లేకుండా వాహనాలను నడుపుతున్న వారిపై, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్న వాహనదారులపై, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిస్తున్న వారిపై కేసులను నమోదు చేశారు. ఈ సందర్భంగా కరీం మాట్లాడుతూ సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం ద్వారా అనేక మంది మృత్యువాత పడుతున్నారన్నారు. కచ్చితంగా హెల్మెట్ ధరించి మాత్రమే వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు స్వామి కళ్యాణి, నరేంద్రబాబు, సురేష్ బాబు, కృష్ణవేణి, అన్నపూర్ణ, జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపేదెప్పుడో..!

బొండాడలో ఇళ్లు తొలగించడంతో కనిపిస్తున్న శిథిలాలు

బొండాడలో ఇళ్ల తొలగింపుతో రోడ్డున పడ్డ 28 కుటుంబాలు

5 కిలోమీటర్ల దూరంలో 20 కుటుంబాలకు స్థలాలు

మరో ఎనిమిది కుటుంబాల ఊసే కరువు

ప్రజాశక్తి - కాళ్ల

రోజువారీ కూలి పనులు చేసుకుని జీవించే ఆ కుటుంబాలు రోడ్డునపడ్డాయి. సుమారు రెండున్నర నెలలుగా ఆయా కుటుంబాలు అద్దె ఇళ్లలో మగ్గుతూ తీవ్ర ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇదీ బొండాడ ప్రధాన రహదారిని ఆనుకుని సుమారు 40 సంవత్సరాలుగా జీవిస్తున్న పేద కుటుంబాల జీవన వేదన.

ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు ఆదేశాలతో అధికార యంత్రాంగం కాల్వలు, బోదె గట్లపై ఉన్న ఇళ్లను తొలగిస్తున్న సంగతి తెలిసిందే. ఆ క్రమంలో బొండాడలో ప్రధాన రహదారిని ఆనుకుని సుమారు 40 సంవత్సరాలుగా ఇళ్లు వేసుకుని జీవిస్తున్న ఇళ్ల తొలగింపును మార్చి రెండో తేదీన అధికారులు చేపట్టారు. దీంతో 24 ఇళ్లలో నివాసముంటున్న 28 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. వారిలో అత్యధికం ఎస్‌సి, ఎస్‌టి, బిసి సామాజిక తరగతులకు చెందిన నిరుపేదలే కావడం గమనార్హం.

ఈ కుటుంబాల్లో సుమారు 18 మందికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో లక్ష్మీనరసింపురంలో నివాస యోగ్యం కాని స్థలాలు చూపి, పట్టాలిచ్చారు. మిగిలిన పది కుటుంబాలకు రాజకీయ కారణాలతో మొండిచెయ్యి చూపినట్లు అప్పట్లో ప్రచారం సాగింది. అయితే 18 కుటుంబాలకు పట్టాలు సుదూర ప్రాంతంలో ఇవ్వడం, పైగా అక్కడ స్థలం నివాసయోగ్యంగా లేకపోవడంతో ఆ కుటుంబాలు అక్కడ ఇళ్లు నిర్మించుకునే ప్రయత్నం చేయలేదు. నాటి నుంచి మొన్నటి వరకూ వారంతా స్వగ్రామం బొండాడలోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ వచ్చారు. అయితే అవేమీ పట్టని పాలకులు గత మార్చి రెండో తేదీన పోలీసు బందోబస్తు నడుమ బలవంతంగా పేదల ఇళ్లన్నీ తొలగించారు. దీంతో మొత్తం 28 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వారంతా గ్రామంలోనే మూడు వేల నుంచి ఐదు వేల వరకూ అద్దె చెల్లించి అద్దె ఇళ్లలో ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. నాటి నుంచి నేటి వరకూ పేదల తరపున సిపిఎం రంగంలోకి దిగి బాధిత కుటుంబాలన్నింటికీ తక్షణం స్థానికంగా ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని పోరాడుతోంది.

లక్ష్మీనరసింహపురం కేటాయించిన ఇంటి స్థలాలు రద్దు చేసి బొండాడలోనే స్థలాలు కేటాయించాలని 18 పేద కుటుంబాలు కోరుతున్నాయి.

బొండాడలోనే ఇళ్ల స్థలాలివ్వాలి

తాడేపల్లి చందనకుమారి, బొండాడ

బొండాడ గ్రామంలో ప్రభుత్వ పోరంబోకు స్థలంలో ఉన్న 24 ఇళ్లను రెండు నెలల క్రితం తొలగించారు. ఇళ్ల తొలగింపుతో 28 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలోని లక్ష్మీ నరసింహపురంలో 18 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. పది మందికి ఇవ్వలేదు. కేటాయించిన స్థలం నివాసానికి అనువుగా లేదు. బొండాడ గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటూ నెలకు రూ.నాలుగు వేలు అద్దె చెల్లిస్తున్నాం. లక్ష్మీ నరసింహపురంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దుచేసి బొండాడలోనే ఇళ్ల స్థలాలిచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

ప్రత్యామ్నాయం చూపాలి

కందుల లీలాకుమారి, బాధితురాలు, బొండాడ

ఇళ్లు తొలగించడంతో నెలకు రూ.5 వేలు అద్దె చెల్లించాల్సి వస్తోంది. బొండాడలో కేటాయించకుండా ఐదు కిలోమీటర్ల దూరంలో లక్ష్మి నరసింహపురం గ్రామంలో ఇళ్ల స్థలాలిచ్చారు. అవేమో ఇళ్లు కట్టుకునేందుకు అనువుగా లేదు. ఇప్పటికైనా వాటిని రద్దు చేసి బొండాడలోని ప్రభుత్వ పోరంబోకు స్థలంలో పట్టాలు ఇవ్వాలి. లేదా బొండాడలోనే ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

కోకోకు అంతర్జాతీయ ధర వచ్చే వరకు పోరు

విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపుదల చేయాలి

కోకో గింజల కొనుగోలు కంపెనీల మోసాలు అరికట్టాలి

ఎపి కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్

నినదిస్తున్న కోకో రైతులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చేవరకు కోకో రైతుల పోరాటం ఆగదని ఎపి కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఎం.నాగులపల్లిలోని పాత పంచాయతీ కార్యాలయం వద్ద ఎపి కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో కోకో రైతుల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. సదస్సులో కోకో రైతుల సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకుండా కంపెనీలు, ట్రేడర్లు కోకో రైతులను మోసగించడం దుర్మార్గమని విమర్శించారు. ఈ ఒక్క సీజన్లోనే గడిచిన మూడు నెలల్లో రూ.వెయ్యి కోట్ల వరకు కోకో రైతులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 17న జరిగిన ఆందోళన సందర్భంగా 20, 21 తేదీల్లోపు ధర నిర్ణయం జరిగే వరకూ కంపెనీలు, ట్రేడర్లు వారి కార్యకలాపాలు నిలుపుదల చేయాలని అంగీకరించి కొన్నిచోట్ల కొనుగోలు చేయడం తగదన్నారు. ఎవరైనా ఒప్పందానికి భిన్నంగా కంపెనీలుగాని, ట్రేడర్లుగాని వ్యవహరిస్తే సరుకు ఎక్కడికక్కడ నిలుపుదల చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో కిలో కోకో గింజలకు రూ.900కు పైగా ధర ఉందని, ఈ ధర రైతులకు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విదేశీ కోకో గింజల దిగుమతులు వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన కోకో గింజలకు వ్యత్యాసపు ధర కూడా చెల్లించాలన్నారు. కోకో రైతుల ఉద్యమానికి అన్ని పంటల రైతులు సంఘీభావం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. 21 లోపు ధర నిర్ణయం కాకపోతే కోకో రైతుల ఉద్యమం మరింత తీవ్రతరమవుతుందని హెచ్చరించారు. అనంతరం ఎం.నాగులపల్లి పాత పంచాయతీ కార్యాలయం వద్ద కోకో రైతులు ధర్నా నిర్వహించారు. కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తూంపాటి అజయ్‌కుమార్, అబ్బూరి పూర్ణచంద్రరావు, రుద్రరాజు సుబ్బరాజు, తూంపాటి సుబ్బారావు, బోయపాటి సత్యనారాయణ, నందమూరి త్రినాథ్, ఎం.వీరబాబు, యు.నాగరాజు, నల్లూరి వెంకట సత్యనారాయణ, సిహెచ్.కృష్ణ, పోలుకొండ నాగరాజు, తూంపాటి మురళీ తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న నేతలు

డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమం ఉధృతం

ఐదో రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని కోరుతూ ఎపి ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంతో ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో అచ్చయ్యపాలెం పంచాయతీ సభ్యులు, ఎటిఎ రాష్ట్ర గౌరవ సలహాదారు తెల్లం రాములు, జిల్లా అధ్యక్షులు సరియం నాగేశ్వరరావు, అచ్చయ్యపాలెం ప్రెసిడెంట్ కుంజా వెంకటేశ్వరరావు, తెల్లం పోతురాజు, కచ్చల చిన్నారెడ్డి, కురసం లక్ష్మి, నడపల సోమరాజు, పి.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. దీక్షలకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా కృష్ణంరాజు, పిడిఎస్‌యు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సరియం రామ్మోహన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెగా డిఎస్‌సిలో నోటిఫై చేసిన షెడ్యుల్ ప్రాంత పోస్టులకు విడిగా ఏజెన్సీ డిఎస్‌సి ప్రకటించాలని కోరారు. డిమాండ్లు నెరవేరకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ పార్టీ జిల్లా అధ్యక్షులు తెల్లం రవిప్రసాద్ మాట్లాడుతూ మంత్రి మండలి ఏర్పాటు చేసి గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. టిఎసిని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

హెల్త్ సెక్రటరీలకు ప్రమోషన్లు కోరుతూ వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వైద్య ఆరోగ్యశాఖలోని హెల్త్ సెక్రటరీలకు తక్షణమే ప్రమోషన్లు కల్పించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఎపి యునైటెడ్ వార్డ్, విలేజ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో హెల్త్ సెక్రటరీలకు ఎంపిహెచ్‌ఎ (ఎఫ్)లుగా ప్రమోషన్లు కల్పించడంలో ఆలస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సెలక్షన్ లిస్ట్ ప్రకటించి, కౌన్సెలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులు అందజేయాలని కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఈ ప్రక్రియను వెంటనే పూర్తి చేసేలా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి.శ్రీలక్ష్మి, నాయకులు టి.హేమలత, నీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

'విఆర్‌ఒ కార్యాలయానికి విఆర్‌ఎ'

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న విఆర్‌ఎను తిరిగి విఆర్‌ఒ కార్యాలయానికి పంపించి వేస్తున్నట్లు తహశీల్దార్ పవన్‌కుమార్ తెలిపారు. పైసలిస్తేనే పనిజరిగేది శీర్షికతో సోమవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి తహశీల్దార్ కార్యాలయ అధికారులు స్పందించారు. గ్రామ విఆర్‌ఎ మండలంలో చేస్తున్న వివిధ ఆగడాలపై తహశీల్దార్ పవన్‌కుమార్ ఆరా తీశారు. ప్రతిరోజూ తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి విధులు నిర్వహించే విఆర్‌ఎ సోమవారం విధులకు హాజరు కాలేదు. విఆర్‌ఎ ఆగడాలపై మండల విఆర్‌ఒల సంఘం, విఆర్‌ఎల సంఘం విడివిడిగా సమావేశం నిర్వహించారు. ప్రజాశక్తిలో వచ్చిన కథనంపై విఆర్‌ఎ పరిస్థితి ఏంటని తహశీల్దార్‌ను ప్రశ్నించగా సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నామని, విఆర్‌ఒ కార్యాలయంలో విధులు నిర్వహించాలని సదరు విఆర్‌ఎను ఆదేశించినట్లు తెలిపారు.

ఇకపై ఫిర్యాదుల స్వీకరణలో డిజిటలైజేషన్ ప్రక్రియ

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి ఏలూరు స్పోర్ట్స్

ఇకపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా వీడియో రికార్డింగ్‌తో ఫిర్యాదులు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశామని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ స్పష్టం చేశారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఫిర్యాదు దారుల వద్ద నుంచి ఎస్‌పి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 45 ఫిర్యాదులు అందుకున్నారు. ఫిర్యాదు దారులకు సత్యసాయి సేవా ట్రస్ట్ ద్వారా ఉచిత భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఎస్‌పి మాట్లాడుతూ ఫిర్యాదులు స్వీకరించే సమయంలోనే వీడియో రికార్డింగ్ చేస్తున్నామని, దీంతో సమస్యల పరిష్కారం త్వరితగతం అవుతుందని తెలిపారు.

నిర్ణీత వ్యవధిలో ప్రజా సమస్యల పరిష్కారం

నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామని నూజివీడు సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ మాట్లాడుతూ ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జఠిలమైన సమస్యలు పరిష్కారం కాకుంటే వాటి వివరాలను అర్జీదారులకు వివరిస్తామన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు మొత్తం 16 రకాలైన సమస్యలను అర్జీల రూపంలో అందించినట్లు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత డిఎస్‌సి శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కెపిడిటి స్కూల్ ఆడిటోరియంలో చేపట్టిన వంద రోజుల మెగా డిఎస్‌సి ఉచిత శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ హాజరై శిక్షణ పొందిన అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. నిరుద్యోగ యువతలో నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫ్యాకల్టీలను తెచ్చి ఉచితంగా అభ్యర్థులకు డిఎస్‌సి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనుకున్న వంద రోజులు కన్నా ఎక్కువ రోజుల పాటు శిక్షణ ఇవ్వటంతో పాటు, స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా అందించామని, ఇటీవల వారికి ఆన్‌లైన్ టెస్టులు కూడా నిర్వహించామని తెలిపారు. శిక్షణా కాలంలో అభ్యర్థులకు ప్రతిరోజూ ఉచితంగా భోజన సౌకర్యం కూడా కల్పించామన్నారు. ఈ శిక్షణ శిబిరం నిర్వహించడంలో ప్రత్యేక చొరవ చూపి, కార్యక్రమం విజయవంతమయ్యేలా కృషి చేసిన ఉప్పలపాటి రామ్‌ప్రసాద్, మురళి మాష్టారు సహా పలువురును శాలువాలతో సత్కరించి అభినందించారు. దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌కు అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.

'మహిళల అభ్యున్నతికి కూటమి కృషి'

ప్రజాశక్తి - చింతలపూడి

మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలోని మీటింగ్ హాలు ఆవరణలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిసి కార్పొరేషన్ ద్వారా 90 రోజుల ఉచిత కుట్టు శిక్షణ ఇస్తారని, టౌన్‌లో 60 మందికి, మండలంలో 60 మందికి శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం కుట్టు మిషన్ పంపిణీ చేస్తారని తెలిపారు.

21న డిఇఒ కార్యాలయాల ముట్టడి

ఉపాధ్యాయ జెఎసి నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ బదిలీలు, రేషనలైజేషన్ ప్రక్రియలో ఉపాధ్యాయ సంఘాల సూచనలు పాటించకుండా ప్రభుత్వం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నెల 21వ తేదీన జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాలు ముట్టడించనున్నట్లు ఉపాధ్యాయ జెఎసి నాయకులు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్‌టియు భవన్‌లో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలన్నీ పాల్గొని ప్రభుత్వానికి తమ వ్యతిరేకత తెలియజేయాలని పిలుపునిచ్చారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు శామ్యూల్, పవన్‌కుమార్, రంగమోహన్, ఆలీ, సాంబశివరావు, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య

వర్ధంతి కార్యక్రమాల్లో ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు

భవిష్యత్తు తరాల బాగు కోసం తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య మహోన్నతుడని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. పవర్‌పేటలోని అన్నే భవనంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి రిటైర్డ్ టీచర్ కెవి.నారాయణరావు మాలాలంకృతం చేశారు. స్పోకెన్ ఇంగ్లీష్ ట్రెనింగ్ పొందుతున్న విద్యార్థులు సుందరయ్య జోహార్ అంటూ నినాదాలు చేసి నివాళులర్పించారు. అనంతరం గుడిపాటి నరసింహారావు మాట్లాడారు. నెల్లూరు జిల్లా అలగానిపాడులో భూస్వామ్య కుటుంబంలో జన్మించిన సుందర రామిరెడ్డి తన పేరులోని కుల ప్రస్తావన తొలగించుకొని దళితులు, వ్యవసాయ కార్మికులు భూమిలేని వారికోసం జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి

నూజివీడు సుందరయ్య భవన్‌లో...

నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు జి.రాజు, ఎఎన్‌ఆర్.హనుమాన్లు మాట్లాడుతూ రాజకీయ నేతల్లో పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శనీయులన్నారు. ఈ కార్యక్రమంలో వసంతరావు, శోభనాద్రి, పద్మాంజలి, నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిఐటియు నాయకులు ఎస్.రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కె.సీతారాములు, ఎస్.శివకుమార్, పి.రమేష్, ఎం.సురేష్, పి.తమ్మారావు, ఎ.సతీష్, ఎ.నాగరాజు, ఎం.త్రిమూర్తులు, సిహెచ్.మరి

ఏలూరు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రంలో...

డియా, యు.గోపీ, ఎం.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిడమర్రు : నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో, భువనపల్లి గ్రామంలో గవర సత్యనారాయణ అధ్యక్షతన వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆయన చూపించిన విప్లవ మార్గం స్ఫూర్తితో మతతత్వ, మతోన్మాదాన్ని తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలగలేటి మోహన, కంచం వరప్రసాద్, లింగబరి లక్ష్మణరావు, కమిలి నాని, భాస్కరరావు, తాడి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : ఎందరో త్యాగమూర్తులకు ఆదర్శ నాయకుడిగా నిలిచిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కంచర్ల రమేష్, కుటుంబరావు, శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : పేద, బడుగు, బలహీన తరగతుల అభ్యున్నతి కోసం నిరంతరం తపించిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని గ్రామంలోని సుందరయ్య కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య మాట్లాడుతూ సుందరయ్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చెక్కపల్లి సోమేశ్వరరావు, జి.అంజలి, శిరీష, పద్మ, గంధం దుర్గమ్మ, రాధ, తదితరులు పాల్గొన్నారు.

టి.నర్సాపురం : మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు గూడెల్లి వెంకట్రావు సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మురళి, మడకం కుమారి, శిరీష, బరగడ కుమారి పాల్గొన్నారు.

చాట్రాయి : మండల కేంద్రమైన చాట్రాయిలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి హెూలీ మేరీ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చనుబండ గ్రామంలో సిపిఎం నాయకుడు గజవెల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, కోటపాడులో సిఐటియు మండల కార్యదర్శి టిఎన్ఎం.సూరి ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు.

కలిదిండి : మండలంలోని భాస్కరరావుపేట, మూలలంక, పోతుమర్రు గ్రామాల్లో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. భాస్కరరావుపేటలో మజ్జిగ పంపిణీ చేశారు. ప్రజాసంఘాల నాయకులు ఎస్.మహంకాళిరావు, వి.భాస్కరరావు, సిహెచ్.శ్రీకాంత్, బి.రామనాగేంద్రం, జి.అనిల్‌కుమార్, కె.శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, మహాలక్ష్మి, శిరీష, అనంతలక్ష్మి, కుమారి, కనకదుర్గ, సిపిఎం కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ సుందరయ్య ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలన్నారు. డివైఎఫ్ఐ నాయకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జీవరత్నం, టౌన్ కన్వీనర్ పి.సూర్యారావు, డివైఎఫ్ఐ నాయకులు జి.సూర్యకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : మండలంలోని కైకరంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుత్తికొండ కృష్ణారావు, కొర్ని అప్పారావు, కోటి నాగేశ్వరరావు, గుండు దుర్గారావు, గోవిందు పాల్గొన్నారు.

నిధుల మంజూరు కోరుతూ మంత్రికి ఎంఎల్‌ఎ వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆశ్రం ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను అభివృద్ధి చేసేందుకు తక్షణమే రూ.ఐదు కోట్లను మంజూరు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి కోరారు. ఏలూరులో సోమవారం జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రిని ఎంఎల్‌ఎ కలిసి వినతిపత్రం అందించారు. ఇప్పటికే ఈ విషయమై సిఎం చంద్రబాబుకు వినతిపత్రం అందించినట్లు చెప్పారు. నిధులు త్వరితగతిన మంజూరయ్యేందుకు తదుపరి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఈ వినతిపై తక్షణం స్పందించిన మంత్రి మనోహర్ అక్కడికక్కడే కలెక్టర్ వెట్రిసెల్వికి తగు ఆదేశాలు జారీ చేశారు.

ప్రణాళికతో రైతుల సమస్యలు తీర్చాలి

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు, గైడ్‌లైన్స్, భూ చట్టాల ప్రకారం రైతుల భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి ఆదేశించారు. గత వారంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వచ్చిన రెవెన్యూ సమస్యలపై అదివారం రాత్రి చాట్రాయి తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన భూ సమస్యలు, వాటి ప్రగతి, పరిష్కార మార్గం గురించి మంత్రి ప్రశ్నించగా అధికారులు పొంతనలేని సమాధానం చెప్పడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాలన్నీ వరుస క్రమంలోనే ఉండాలి

రాజకీయ నేతల విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు నియోజకవర్గంలో పోలింగు కేంద్రాలు మండలాల వారీగా వరుస క్రమంలో ఉండేలా సవరణలు చేయాలని పలువురు రాజకీయ పార్టీ ప్రతినిధులు కోరారు. ఉంగుటూరు అసంబ్లీ నియోజకవర్గం ఓటు నమోదు సహాయ అధికారి, ఉంగుటూరు తహశీల్దార్ పాలపర్తి రవికుమార్ అధ్యక్షతన సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నిడమర్రు, గణపవరం మండలాల్లో పోలింగ్ కేంద్రాల వరుస క్రమంలో లేవని, వాటిని సరిదిద్దాలని వైసిపి ప్రతినిధి పాపారావుబాబ్జి, టిడిపి ప్రతినిధి బాలనందం, సిపిఐ నాయకుడు గుత్తికొండ వెంకటకృష్ణారావు అన్నారు. పలు పోలింగ్ కేంద్రాల్లో 1500 ఓటర్లు, కొన్ని కేంద్రాల్లో అంతకన్నా తక్కువగా ఓటర్లు ఉన్నారని, నియోజకవర్గంలో అన్ని పోలింగు బూత్‌ల్లో సమానంగా ఓట్లు ఉండేలా చూడాలని కోరారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ రాజకీయ పార్టీ ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎన్నికల డీటీ పోతురాజు పాల్గొన్నారు.

నేత్రదానం చేసిన అప్పారావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరానికి చెందిన రైతు గుత్తికొండ అప్పారావు (83) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన నేత్రాలను నిడదవోలు కంటి ఆసుపత్రికి దానం చేయడంలో కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. సంబంధిత వైద్య సిబ్బంది వచ్చి కార్నియాను సేకరించుకెళ్లారు.

జనసేన, ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయంతో పాటు ఉంగుటూరు ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయం ఒకే సముదాయంలో ఉండటంతో ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఎంతో అనువుగా ఉంటుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు తన సొంత నిధులతో ఉంగుటూరులో నిర్మించిన క్యాంపు, పార్టీ కార్యాలయాన్ని మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంఎల్‌ఎ ధర్మరాజు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్యాలయానికి వచ్చిన వారి సమస్యలను తన పరిధిలో పరిష్కరించేందుకు క్యాంపు కార్యాలయ నిర్వహణ అభినందనీయమన్నారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో పయనించేందుకు క్యాంపు కార్యాలయం దోహదపడుతుందన్నారు. అనంతరం పలు గ్రామాల నుంచి ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు జనసేనలోకి చేరారు.

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా టిడిపి

ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్యకర్తలకు తెలుగుదేశం ఎల్లవేళలా అండగా ఉంటుందని, వారి సమస్యలను తీర్చడానికి సిద్ధంగా ఉన్నామని ఎపి ట్రైకార్ ఛైర్మన్, టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. కొయ్యలగూడెంలో తెలుగుదేశం పోలవరం నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకులు, కీర్తిశేషులు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బొరగం శ్రీనివాసులు సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌తో పాటు తాను నియోజకవర్గస్థాయిలో కార్యకర్తలకు అనుక్షణం అండగా ఉంటామన్నారు. గత పాలనలో కేసులతో సతమతమైన కార్యకర్తలకు న్యాయం చేయడానికి పార్టీ కట్టుబడి ఉందన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తనూ ఆదుకోవడానికి నామినేటెడ్ పదవులు లేదా స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ జిల్లా అధ్యక్షులు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ 2014-2019 మధ్య పెండింగ్‌లో ఉన్న బిల్లులకు నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని తీర్మానించినట్లు తెలిపారు. ఈ తీర్మానాన్ని బొరగం శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు అనపర్తి వెంకటనారాయణ బలపరిచారు. పార్టీ మండలాధ్యక్షులు పారేపల్లి నరేష్,

మాట్లాడుతున్న టిడిపి నేతలు

మొగపర్తి సోంబాబు, అమరావరపు అశోక్, సుంకవల్లి సాయి, నాయుడు రామకృష్ణగౌడ్, రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మినీ మహానాడుకు తరలిన టిడిపి నేతలు

పోలవరం : కొయ్యలగూడెంలో నిర్వహించిన టిడిపి పోలవరం నియోజకవర్గ మినీ మహానాడుకు టిడిపి నేతలు తరలివెళ్లారు. తొలుత పోలవరం పంచాయతీ ఆవరణలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, టిడిపి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచి మంగిన కొండ, యువజన నాయకులు ఆకుల రాజా, ఎస్‌సి సెల్ నాయకులు యడ్ల వినోద్, పొట్నూరి నారాయణరావు, కంభంపాటి గోపీ, తదితరులు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లలో మార్పుతో కేన్సర్

ఆశ్రం ఆధ్వర్యాన కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

ఏలూరు సిటీ : ఆశ్రం హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య, నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పు కారణంగా కేన్సర్ వ్యాపిస్తుందన్నారు. చెడు అలవాట్లు కారణంగా, పరిశుభ్రత పాటించనందువల్ల కేన్సర్ వ్యాధి రావొచ్చన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబంలో ఈ వ్యాధికి సంబంధించిన పరీక్షలు నిర్వహించుకోవడం చాలా ఖర్చుతో కూడుకున్న పని అని, అందువల్ల ఉచితంగా ఈ స్క్రీనింగ్ క్యాంప్‌ను మున్సిపల్ స్టాఫ్, శానిటేషన్ సిబ్బందికి ఉపయోగపడేలా ఏర్పాటు చేశామన్నారు. ఎంఎల్‌ఎ చంటి, మేయర్ నూర్జహాన్ పెదబాబు దగ్గర ఉండి శానిటేషన్ సిబ్బందికి పరీక్షలు చేయించారు. అదే విధంగా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించే యూనిట్‌ను సందర్శించారు. ఆశ్రం ఆసుపత్రి సిఇఒ రాజరాజన్ ఆధ్వర్యంలో డాక్టర్ హేమానళిని, డాక్టర్ డివి.సాయి షణ్ముఖ గౌతమ్, డాక్టర్ సుప్రియ స్పందన, డాక్టర్ హరిత బృందం పరీక్షలు నిర్వహించింది. ఆశ్రం ఆసుపత్రి మేనేజర్ భాను ప్రదీప్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎ.భాను ప్రతాప్, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

ఓటిఎస్ కోరుతూ ఎంఎల్‌ఎకు వినతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సొసైటీల ద్వారా రుణాలు తీసుకుని నగదు కట్టలేని వాటికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ ఇప్పించాలని, అదే విధంగా రుణాలు తీసుకుని చనిపోయిన వారి రుణాలను మాఫీ చేయాలని కోరుతూ పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో పలువురు రైతులు సోమవారం వినతిపత్రం అందించారు. భూములను సొసైటీలో తనఖా పెట్టి రుణాలు తీసుకుని ఆ నగదు కట్టకుండా భూములను వేరే వ్యక్తులకు అమ్ముకుంటున్నారని సొసైటీ యాజమాన్యం ఓ కుటుంబానికి నోటీసులు ఇవ్వడం సంచలనంగా మారింది. దీనిపై సొసైటీల్లో రుణాలు తీసుకున్న పలువురు రైతులతో వరుస సమావేశాలు పెట్టి సొసైటీల తీరుపై విమర్శలు చేశారు. ఈ విషయాన్ని ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలను చెప్పుకున్నారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నోటీసులు ఇచ్చి ఒకేసారి పెద్ద మొత్తంలో నగదు కట్టమనడం సరికాదని, సొసైటీ అధికారులు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రైతు రుణాలకు సంబంధించి ఉన్న మొండి బకాయిలకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ ఇచ్చేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రుణాలు తీసుకున్న రైతుల పట్ల సిబ్బంది నియంతల ప్రవర్తిస్తే వారిపై కూడా చర్యలకు ఆదేశిస్తానని హెచ్చరించారు.

ఇంగ్లీష్ భాష నేర్చుకోవాలంటే ఆసక్తి ఉండాలి

ఏలూరు : ఇంగ్లీష్ భాష నేర్చుకోవాలంటే అభిమానం, ఆసక్తి పెంచుకోవాలని సిఆర్.రెడ్డి డిగ్రీ కళాశాల ఇంగ్లీష్ రిటైర్డ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ పి.ఆంజనేయులు అన్నారు. పవర్‌పేటలోని అన్నే భవనంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం స్పోకెన్ ఇంగ్లీష్ ట్రెనింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. ఆయనకు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు స్వాగతం పలికారు. 15 రోజుల శిక్షణ కేంద్రానికి ట్రెనర్‌గా రిటైర్డ్ టీచర్ కెవి.నారాయణరావు వ్యవహరిస్తున్నారు. పి.ఆంజనేయులు మాట్లాడుతూ భాషను అభివృద్ధి చేసుకోవడం కోసం, భాషను సమయస్ఫూర్తిగా వినియోగించగలడం కోసం నారాయణ రావు విద్యార్థులకు నేర్పటానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 15న ప్రారంభించిన శిక్షణా శిబిరానికి 30 మంది విద్యార్థులు వస్తున్నారని, 31 వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీష్ ట్రెనర్ కెవి.నారాయణరావు మాట్లాడుతూ చదవడం, రాయడం వచ్చి ఉండాల్సిన అవసరం లేదని, మాట్లాడటం కోసం ప్రత్యేక ప్రయత్నం చాలా అవసరమని చెప్పారు.

వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ

ద్వారకాతిరుమల : మండలంలోని గున్నం పల్లిలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆయన తనయుడు వంగవీటి వంగవీటి రాధా సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జనసేన గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, జనసేన పార్టీ నాయకురాలు క్రాంతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వంగవీటి రాధా మాట్లాడుతూ యువకులు కనీసం రంగాను చూసిన దాఖలాలు లేనప్పటికీ, ఆయన మీద అభిమానంతో ఈ కార్యక్రమానికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వంగవీటి మోహన రంగా, ఒక సామాజిక తరగతికో, మతానికో చెందిన వ్యక్తి కాదన్నారు. పేద, బడుగు, బలహీన తరగతుల కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సువర్ణరాజు మాట్లాడుతూ రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జనసేన పార్టీ నాయకురాలు క్రాంతి మాట్లాడుతూ రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గ్రామస్తులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సువర్ణ రాజుతో కలిసి జనసేన స్థూపాన్ని ఆవిష్కరించారు.

డిఎస్‌సి అభ్యర్థులు గ్రాండ్‌టెస్ట్ వినియోగించుకోండి

ప్రజాశక్తి - చింతలపూడి

డిఎస్‌సి రాయనున్న అభ్యర్థులకు పిఆర్‌టియు ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రాండ్ టెస్ట్లను వినియోగించుకోవాలని ఎంఇఒ-2 కిరణ్‌బాబు తెలిపారు. పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి.సుబ్బారావు చింతలపూడి పర్యటనలో భాగంగా జిల్లా, మండల నాయకులతో కలిసి సోమవారం కరపత్రం ఆవిష్కరించారు. డిఎస్‌సి గ్రాండ్ టెస్ట్ రాసేవారు తమ పేర్లు 9441698486, 9441751678 నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ ఎన్ఎస్.రాజేంద్రకుమార్, కె.కృష్ణంరాజు, మండల ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, మండల నాయకులు జోషి పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు 18వ రోజు సోమవారం కొనసాగాయి. ఈ శిక్షణా తరగతులకు చిన్నారులు ఎంతో హుషారుగా పాల్గొన్నారు. తొలుత గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులకు చదవడం మాకిష్టంలో భాగంగా నీతి కథలను చదివించి, కథలు చెప్పించారు. రిసోర్స్ పర్సన్ కె.శ్రీనివాసరావు విద్యార్థులకు గణితంలో మెలకువలపై శిక్షణ అందించారు. రిసోర్స్‌పర్సన్ వై.ఫణికాంత్ ప్రముఖ నృత్య కళాకారులు విద్యార్థులకు నృత్యాలపై శిక్షణ కొనసాగించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి.సందీప్‌కుమార్, ఎండి.అస్లాంపాషా, బివిఎస్.లక్ష్మి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No. 277/2024

Between:

వాది : నందనపునీడి తులసిరత్నం

మరియు

ప్రతివాది : తోట హరి సత్యనారాయణ

ప్రతివాది : తోట హరి సత్యనారాయణ, C/o. రాజేశ్వరరావు, D.No. 18-3-1-19, Opposite building of Med-plus Medical stores, ఉండ్రాజవరం రోడ్డు, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534211.

పై నెంబరు దావా గ్రంథము నందు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము మీకు ఎన్నిసార్లు నోటీస్లు మరియు దావాలో సమన్లు పంపించిననూ అమలు జరగని కారణముగా Substitute of Service ద్వారా అనగా పేపర్ ప్రకటన ద్వారా నోటీస్లు శ్రీ కోర్టు వారు ఆర్డర్ వేసినారు. కావున ఈ ప్రకటన తేదీ నుండి 30 రోజుల లోగా కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// BY ORDER //

ఇందుకూరి వెంకట నరసింహారాజు
వాది తరపు న్యాయవాది
తణుకు
తణుకు
ది.18-05-2025
సెల్ నెం: 99481 93227

IN THE COURT OF THE VII ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE-CUM-FAMILY COURT OF ELURU, W.G.Dt

F.C.O.P.No. 27/2025

Between:

Pericherla @ Ramayanam Mani Deepika ...Petitioner

And

Pericherla Vasu ...Respondent

Respondent :

Pericherla Vasu, S/o. Apparao, Hindu, male, Aged about 42 yrs, Saftware Employee, R/o. D.No: 1-64/1, Rachuru Village, unguturu Mandal, Eluru Dt.

మీరు పైన తెలిపిన F.C.O.P 27/2025 లో పైన తెల్పిన ప్రతివాది అయివున్నారు. మీకు ఎన్నిసార్లు పైన తెల్పిన VII Addi District Family జడ్జి ఏలూరు వారి కోర్టు వారి యొక్క ఉత్తర్వుల ప్రకారం మీకు **ది. 22-05-2025వ తేదీన ఉదయం గం. 10-30 నిIIలకు** హాజరు కావలెను. లేని యెడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

T. Vikash,
Advocate, Eluru
Eluru
Dt: 19-05-2025
Cell: 94922 62919

మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి ఏలూరు వారి కోర్టులో

I.A.No. 412/2024 in O.S.No. 83/2015

బిట్వీన్:-

కూనలక్ష్మీ మరియు వగైరాలు

...పిటీషనర్లు/1.3 to 5 ప్రతివాదులు

మరియు

కె. హరినాథబాబు మరియు వగైరాలు

...రెస్పాండెంట్లు/వాది/02

పై నెంబరు గ్రంథమును పిటీషనర్లు, రెస్పాండెంట్లు పై దావా షెడ్యూలు దాఖలా ఆస్తిపై **ది.7-04-2012వ తేదిన** జరిగిన Sale Agreement ను Rescission చేయవలసినదిగా పై కోర్టులో దాఖలు చేసియున్నారు. దానిపై 4 to 6 రెస్పాండెంట్లు అయిన

R4. కూన విజయకుమార్, S/o. (లేటు) రాము, D.No. 672, పోణంగిరోడ్, YSR కాలనీ, 13 th రోడ్, ఏలూరు, ఏలూరు జిల్లా, A.P.

R5. పొట్ట శ్రీదేవి, D/o. (లేటు) రాము, D.No. 672, పోణంగిరోడ్, YSR కాలనీ, 13 th రోడ్, ఏలూరు, ఏలూరు జిల్లా, A.P.

R6. గుడవర్తి హిమబిందు, D/o. (లేటు) రాము, D.No. 672, పోణంగిరోడ్, YSR కాలనీ, 13 th రోడ్, ఏలూరు, ఏలూరు జిల్లా, A.P.

అనువారలకు ఏ విధమైన అభ్యంతరములు ఉన్న ఎడల **ది.16-06-2025వ తేదీ ఉదయం గం. 10-30 నిIIలకు** స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

శ్రీ పర్వతనేని పూర్ణచంద్రజోషి
న్యాయవాది
ఏలూరు
ఏలూరు - 2
తేది:19-05-2025
సెల్: 98481 73333